జిఒ నంబరు 1 ప్రతులను భోగి మంటల్లో దహనం చేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

# ఊరంతా సంక్రాంతి

- పట్టణాలు, గ్రామాల్లో పండగ హడావుడి
- సందడి చేస్తున్న కళాకారులు
- పల్లెబాట పట్టిన పట్టణవాసులు
- కళకళలాడుతున్న మార్కెట్లు
- రద్దీగా మారిన రోడ్లు
- ప్రయాణాలకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

తెలుగు వారు ఘనంగా జరుపుకునే ముఖ్యమైన పండుగల్లో ఒకటైన సంక్రాంతి రానే వచ్చింది. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా పెద్ద పండుగను అన్ని తరగతుల ప్రజలు కుటుంబాలతో కలిసి జరుపుకోవడంతో పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ఎక్కడ చూసినా సంక్రాంతి సందడి కనిపిస్తుంది. దూర ప్రాంతాల్లో నివసించే వారు స్వస్థలాలకు చేరుకున్నారు. దీంతో పల్లెలు, పట్టణాల్లో పండగ సందడి పతాకస్థాయికి చేరింది.

సంక్రాంతి పండగకు ఎక్కడెక్కడో ఉన్న వారు స్వగ్రామాలకు చేరుకున్నారు. గ్రామాలు, పట్టణాల్లో సంక్రాంతికి శోభను తీసుకొచ్చే హరిదాసులు, గంగిరెద్దులు, చెంచులు, బుడగజంగాలు, డప్పు వాయిద్య కళాకారులు హడావుడి చేస్తున్నారు. జానపద కళాకారుల ఆటపాటలు సంక్రాంతికి మరింత వన్నె తెచ్చి పెట్టింది. నిరుపేదలకు పలువురు దాతలు వ్యక్తిగతంగానే కాకుండా సంస్థలు, సంక్షేమ సంఘాల తరపున వస్త్ర దానాలు వంటి కార్యక్రమాలను కూడా పండగ సందర్భంగా నిర్వహిస్తున్నారు.

**కిటకిటలాడిన మార్కెట్లు, వస్త్ర దుకాణాలు**

కరోనా కారణంగా రెండేళ్ల అంతంతమాత్రంగా సాగిన వస్త్ర దుకాణాల వ్యాపారాలు ఈ ఏడాది పండగ కళను సంతరించుకున్నాయి. కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకూ వస్త్రాల కొనుగోలుతో దుకాణాల్లో రద్దీ నెలకొంది. డిమాండ్‌కు తగ్గట్లుగా తగినట్లే వస్త్ర వ్యాపారులు రకరకాల డిజైన్లను అందుబాటులోకి తెచ్చారు. వస్త్ర వ్యాపారులు అక్టోబరు నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు కొనుగోలు చేసేందుకు వెళ్లడం ప్రారంభిస్తారు. నవంబరు నెలాఖరు నాటికి పలురకాల వస్త్రాలను తెప్పిస్తారు. శ్రీకాకుళం నగరంలో చిన్నాపెద్దా అన్నీ కలిపి 200కు పైగా వస్త్ర దుకాణాలు ఉన్నాయి. ఇవి కాకుండా ఆన్‌లైన్ వస్త్ర వ్యాపారం కూడా విస్తృతంగా సాగుతోంది. జిల్లా నలుమూల నుంచి ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఈ ఏడాది క్రిస్మస్ నుంచి ఈ వ్యాపారం ఊపందుకుంది. సంక్రాంతి వరకూ వస్త్ర దుకాణాలన్నీ జన సందడితో కళకళలాడుతున్నాయి. స్థానికులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారితో జిల్లా కేంద్రంలోని జి.టి రోడ్డు, పాలకొండ రోడ్డు, కళింగ రోడ్డు, డేఅండ్‌నైట్, సూర్యమహల్ కూడలి వద్ద జన సందడి నెలకొంది. మరోవైపు పండగకు అవసరమైన సరుకులను కొనుగోలు చేసేందుకు వచ్చిన జనాలతో పొట్టి శ్రీరాములు మార్కెట్, రైతుబజారు కిటకిటలాడింది.

**టిక్కెట్ల కోసం థియేటర్ల వద్ద పడిగాపులు**

ఇదే సందర్భంలో వరుసగా కొత్త సినిమాలు విడుదల కావడంతో వాటికి డిమాండ్ నెలకొంది. టిక్కెట్ల కోసం థియేటర్ల వద్ద క్యూ కడుతున్నారు. పండగ రోజుల్లో ఇంటిల్లిపాదీ సినిమాలు తిలకించేందుకు టిక్కెట్లను అడ్వాన్స్ బుకింగ్ చేసేసుకుంటున్నారు. వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి, వారసుడు, కళ్యాణం కమనీయం సినిమాలు విడుదల కావడంతో వాటిని తిలకించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

**గ్రామాల బాట పట్టిన వలసవాసులు**

ఉపాధి కోసం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్ళిన వారంతా సంక్రాంతి నేపథ్యంలో తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారు. ఇప్పటికే కొందరు స్వస్థలాలకు చేరుకోగా, మరికొందరు సంక్రాంతి పండగ రోజుకు చేరుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది. పండగ నేపథ్యంలో బస్సులు, రైళ్లు అన్నీ రద్దీగా ఉన్నాయి. గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో సొంత వాహనాలపైనే ఎక్కువగా ప్రయాణాలను సాగించేందుకే ఎక్కువగా ప్రజలు మొగ్గుచూపుతున్నారు.

కిటకిటలాడుతున్న పొట్టిశ్రీరాములు మార్కెట్

వస్త్ర దుకాణంలో కొనుగోలుదారుల రద్దీ

## భోగి మంటల్లో జిఒ 1 ప్రతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం యంత్రాంగం

రోడ్లపై ర్యాలీలు, సభలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబరు 1ని నిరసిస్తూ ఆలిండియా లాయర్స్ యూనియన్, తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యాన జిల్లాలోని పలుచోట్ల భోగి మంటల్లో జిఒ ప్రతులను దగ్ధం చేసి శనివారం నిరసన తెలిపారు. ఆమదాలవలసలోని పూజారిపేటలో ఐలు రాష్ట్ర నాయకులు బొడ్డేపల్లి మోహనరావు జిఒ ప్రతులను భోగి మంటల్లో వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నాటి జిఒను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రహదారులపై సభలు, సమావేశాలను నియంత్రించే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నిరంకుశంతో కూడుకుందని విమర్శించారు. కార్యక్రమంలో పైడిరాజు, పాణిగ్రాహి, బొడ్డేపల్లి ఈశ్వరరావు, బుడుమూరు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు జిఒ ప్రతులను, రాష్ట్రంలో టిడిపి కార్యకర్తలపై నమోదైన కేసుల ఎఫ్ఐఆర్ కాపీల ప్రతులను భోగి మంటల్లో వేశారు. సైకో పాలన పోవాలి... సైకిల్ పాలన రావాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని, రాజకీయ పార్టీల స్వేచ్ఛా హక్కును కాలరాసే విధంగా ఈ జిఒ జారీ చేసిందని విమర్శించారు. లోకేష్ యువగళం పాదయాత్రను, చంద్రబాబు సభలను అడ్డుకోవడానికే ప్రభుత్వం చీకటి జిఒను తీసుకొచ్చిందన్నారు. టిడిపికి లభిస్తున్న జనాదరణను ఓర్వలేని వైసిపి ప్రభుత్వం, ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిచ్చి నియంతృత్వ పోకడలను అవలంభిస్తోందని ధ్వజమెత్తారు. ఇలాంటి జిఒలే తీసుకొస్తే ప్రతిపక్ష నేతగా జగన్ పాదయాత్ర చేసే వారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, దానికి చరమగీతం పాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మెండ దాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలో భోగి మంటల్లో జిఒ ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ఎస్.వెంకటరావు, శిల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలాసలో జిఒ ప్రతులను దగ్ధం చేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, డిక్కల ఆనంద్, బి.నాగరాజు, ఎస్.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస మండలం కొర్లకోట, కనుగులవలస, శ్రీనివాసాచార్యుల పేట, సరుబుజ్జిలి మండల కేంద్రంలో టిడిపి నాయకులు జిఒ ప్రతులను భోగి మంటల్లో దగ్ధం చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లీశ్వరరావు, మండల అధ్యక్షుడు నూకరాజు, బొడ్డేపల్లి గౌరీపతి, ఎండ రామారావు, అన్నెపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

లావేరులో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు క్యాంపు కార్యాలయం వద్ద, మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, కేశవరాయునిపురంలో ఎఎంసి మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర, ఆదపాకలో మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ జిఒ ప్రతులను భోగి మంటల్లో దగ్ధం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొర్లె శ్రీనివాసరావు, పి.మధుబాబు, ఆర్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : జిఒ ప్రతులతో ఐలు నాయకులు

సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలుపుతూ ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసలో సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసి సైకత శిల్పం పలువురిని ఆకట్టుకుంది. సైకత శిల్పాన్ని చూసేందుకు వచ్చిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హరికృష్ణను అభినందించారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

## 'నవోదయ'లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

**శ్రీకాకుళం :** 2023-24 విద్యా సంవత్సరానికి గానూ సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ https://navodaya.gov.in ద్వారా ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు మూడు, నాలుగు తరగతులు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి 2022-23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ఉండాలని స్పష్టం చేశారు. మే 1, 2011 నుంచి ఏప్రిల్ 20, 2013 మధ్యలో జన్మించి ఉండాలని తెలిపారు. సంబంధిత ధ్రువపత్రాలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలనుకునే వారు సంబంధిత హెచ్‌ఎం సంతకంతో కూడిన ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాలని సూచించారు. ప్రవేశ పరీక్ష జిల్లాలోని ప్రధాన కేంద్రాల్లో ఏప్రిల్ 29వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ప్రముఖుల సంక్రాంతి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా ప్రజలకు పలువురు ప్రముఖులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖసంతోషాలతో సంక్రాంతిని ఆనందంగా చేసుకోవాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందుతుండడంతో నూతన సంవత్సర ఆరంభానికి ముందే రాష్ట్రంలోని ప్రతి లోగిళ్లలో సంక్రాంతి కళ సంతరించుకుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సంక్రాంతి సకల శుభాలు తేవాలని, సౌభ్రాతృత్వం, సౌభాగ్యం వెల్లివిరియాలని కోరుకుంటున్నట్లు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వరుసగా ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రజలంతా సంక్రాంతి ఎంతో ఘనంగా నిర్వహించుకుంటున్నారని పేర్కొన్నారు. పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, హాయిగా ఆనందంగా ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆకాంక్షించారు. కొత్త పంట ఇంటికి వచ్చిన అనంతరం చేసుకునే పెద్ద పండగ సంక్రాంతి అని పేర్కొన్నారు. సంక్రాంతి ప్రతి ఇంటా ఆనందపరవశం కావాలని ఆకాంక్షించారు.

## అరసవల్లిని సందర్శించిన హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి తర్లాడ రాజశేఖరరావు శనివారం దర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆయన ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి సేవల అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆలయ ఇన్‌ఛార్జి ఎస్ఇ కె.వెంకటేశ్వరరావు స్వామి వారి చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు. కార్యకమంలో జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, ప్రోటోకాల్ జడ్జి కె.రాణి, తహశీల్దార్ వెంకటరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్ చక్రవర్తి, పోలీస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న వెంకటేశ్వరరావు

## జనసేనానికి చప్పట్లేనా?

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

యువశక్తి పేరుతో జనసేన నిర్వహించిన సభ జిల్లాలో రాజకీయ వేడిని రగిలించింది. ప్రధాన రాజకీయ పక్షాలైన వైసిపి, టిడిపిలో చర్చ రేపింది. ఒకవైపు పవన్ కళ్యాణ్ సభ జరుగుతుండగానే, టిడిపి నాయకులు సభకు హాజరైన జనంపై ఆరా తీయడం మొదలుపెట్టారు. టిడిపికి చెందిన ఓ ముఖ్య రాష్ట్ర నేత ఒకరు మీడియాకు ఫోన్ చేసి మరీ ఆరా తీశారు. సభ ఎంత సక్సెస్ అయితే, తమకు అంత నష్టంగా టిడిపి వర్గాలు భావిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఓట్లు మాట పక్కన పెడితే సభకు వచ్చే జనాన్నే రాజకీయ పార్టీలు ప్రామాణికంగా తీసుకుంటాయి. తమకు ఉన్న ఫాలోయింగ్‌ను చూపి సీట్ల బేరం పెడతాయి. టిడిపి, జనసేన కలిసి పోటీ చేస్తాయన్న ప్రచారం నేపథ్యంలో పవన్ సభకు జనం పోటెత్తడంతో ఎక్కువ సీట్లు తమను డిమాండ్ చేయొచ్చన్న ఆందోళన టిడిపిలో ఉన్నట్లుగా కనిపిస్తోంది. తమకు గౌరవం తగ్గకుండా ఉంటే పొత్తు పెట్టుకుంటామని, లేకుంటే ఒంటరిగానే పోటీ చేస్తానని చెప్పడం ద్వారా పవన్ కళ్యాణ్ ఆశిస్తోందేమిటో ఇప్పటికే టిడిపికి అర్థమైంది.

అధికార వైసిపిలోనూ పవన్ సభ కలవరం రేపింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైసిపిపై పవన్ చేసిన విమర్శలపై ఆ పార్టీ నేతలు ఒంటి కాలిపై లేచారు. ఈ అంశంలో ఇద్దరు ముగ్గురు నాయకులు నోరుజారారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కౌంటర్లు ఇచ్చారు. పవన్ ప్రసంగంపై విమర్శల విషయంలో ధర్మాన ప్రసాదరావు వ్యక్తిగత దూషణల జోలికి వెళ్లకుండా హుందాగా వ్యవహరించారు. బిజెపితో సంసారం చేస్తూనే, టిడిపికి కన్ను కొడుతూ పవన్ రాజకీయ వ్యభిచారం చేస్తున్నారంటూ కృష్ణదాస్ వ్యాఖ్యానించారు. సీనియర్ నాయకునిగా, సౌమ్యునిగా పేరొందిన వ్యక్తి ఈ రకమైన పదజాలం వాడడం ద్వారా తన ప్రతిష్టను తానే దిగజార్చుకున్నట్లు అయింది. ఎమ్మెల్సీ దువ్వాడ తొలి నుంచీ దుందుడుకుతనంగానే వ్యవహరిస్తున్నారు. పవన్ ప్రసంగంపై విమర్శల విషయంలోనూ కృష్ణదాస్ మాటలనే ఆయనా వల్లించారు. అధినేత మెప్పు కోసమో, పార్టీ అప్పగించిన బాధ్యతను ఘనంగా నిర్వర్తించామని చెప్పుకునేందుకో గానీ నాయకుల నోట వచ్చిన కొన్ని పదజాలాలు అభ్యంతరకరమైనవే. ప్రజాస్వామ్యవాదులెవరూ వీటిని స్వాగతించరు. అటు పవన్ ప్రసంగంలోనూ అభ్యంతరకరమైన పదజాలాలు వచ్చాయి. యువతీ, యువకులు భారీగా హాజరైన సభలో మంత్రులను అభ్యంతరకరంగా సంబోధించడాన్ని తప్పు పట్టాల్సిందే. రాజకీయాల్లోకి యువతను ఆహ్వానిస్తూనే, వాటిపై వారికి ఏహ్యాభావం కలిగేలా వ్యవహరించడం సరికాదు. సినీ స్టార్ మాటలకు జనం కేరింతలు కొట్టినా, ఆ మాటలను ఎవరూ హర్షించరు. వ్యక్తిగత దూషణలు, పరస్పరం తిట్టుకోవడం ద్వారా యువతలో రాజకీయ పార్టీలు, నాయకులపై ఏహ్యాభావం ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికైనా రాజకీయ సభలు, సమావేశాల్లో హుందాగా వ్యవహరించాలని ప్రజాస్వామ్యవాదులు కోరుకుంటున్నారు.

పవన్ తన ప్రసంగంలో పలుమార్లు అభిమానులకు చురకలంటించారు గతంలో రాజాం సభకు బాగా వచ్చారు, చప్పట్లు కొట్టారని, ఓట్ల దగ్గరకు వచ్చేసరికి వదిలేశారంటూ నిందించారు. చట్టసభలకు పంపకుండా బయట నుంచే పోరాడే శిక్షను వేశారంటూ నిట్టూర్చారు. క్షేత్రస్థాయిలో బలం ఉంటే ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేస్తానని, ఆ నమ్మకం మీరివ్వగలరా అంటూ ఒకసారి, నన్ను నమ్మండి అంటూ మరోసారి జనాన్ని ప్రశ్నించడం, విన్నవించడం చూస్తే తనను జనం విశ్వసించడం లేదని గుర్తించినట్లు కనిపిస్తోంది. జనం తనను నమ్మకపోవడానికి తన రాజకీయ విధానమే కారణమన్న ముఖ్యమైన అంశాన్ని ఆయన ఇప్పటికీ గుర్తించినట్లు కనిపించడం లేదు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపితో అంటకాగుతుంటే ఎవరైనా ఎలా నమ్ముతారు? విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై వైసిపి ఎంపీలు ఎందుకు నోరెత్తడం లేదని ప్రశ్నిస్తున్న పవన్, అందుకు కారణమైన కేంద్ర ప్రభుత్వాన్ని, బిజెపిని వదిలేస్తున్నారు. ప్రత్యేక హోదా, విభజన చట్టం అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపిని సమర్థిస్తుంటే, ఎవరు మాత్రం ఆ పార్టీకి దగ్గరవుతారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుకు పాలకులే కారణమని నిందిస్తున్న జనసేనాని, బిజెపిని మాత్రం మినహాయించారు. ఈ ప్రాంతంలో సభ నిర్వహించి విశాఖకు రైల్వేజోన్, ఉత్తరాంధ్ర జిల్లాలకు వెనుబడిన ప్రాంత నిధులు ఇవ్వకుండా అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వంపై జాలి చూపిస్తే జనం ఎలా స్వీకరిస్తారు?. తనకు అన్ని సామాజిక తరగతులు, మతాలు ఒక్కటే అని చెప్తున్న పవన్ కళ్యాణ్, సమాజాన్ని మతాల వారిగా విడదీస్తున్న బిజెపితో కలిసి ప్రయాణిస్తానంటే నమ్మడం కష్టమే. ఇకనైనా తన రాజకీయ విధానాన్ని సమీక్షించుకుని, అడుగులు వేయకుంటే ఆయన చెప్పినట్లే చప్పట్లే మిగులుతాయి.

## భోగికి దూరంగా పలు గ్రామాలు

ప్రజాశక్తి - నౌపడ / పలాస / నరసన్నపేట

తెలుగువారికి పెద్ద పండగ సంక్రాంతి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఇంటికి తీసుకొచ్చే సమయంలో నాలుగు రోజుల పాటు సంక్రాంతి పండగను జరుపుకోవడం సంప్రదాయంలా వస్తోంది. వరుసగా భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పండగలను నాలుగు రోజుల పాటు కుటుంబ సభ్యులతో సందడిగా జరుపుకుంటారు. వృత్తి, వ్యాపారులు, బతుకుతెరువు నిమిత్తం పలు ప్రాంతాల్లో ఎక్కడెక్కడో ఉన్నా సంక్రాంతి పండగకు రాని వారంటూ ఉండరు. అలాంటి మధురానుభూతులకు ఆలవాలమైన భోగి మంట వేడుకలకు కొన్ని గ్రామాలు తరతరాలుగా దూరంగా ఉంటున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో భోగి పండగను జరుపుకోని గ్రామాలు ఇంచుమించు ఉండవు. చిన్నారుల నుంచి పెద్దల వరకు తెల్లవారుజామునే ఆవుపేడతో ప్రత్యేకంగా చేసిన భోగి పిడకలతో గ్రామంలోని ఓ ప్రత్యేక స్థలంలో ఏర్పాటు చేసిన భోగి మంటల వద్దకు చేరి సందడిగా గడుపుతారు. పిల్లల విషయానికొస్తే ఆ ముచ్చటే వేరు. వారి ఆనందాన్ని వర్ణించలేం. అయితే నరసన్నపేట మండలంలో పలు గ్రామాల ప్రజలు భోగి పండగే తెలియదు. భోగి మంటలు వేయరు.

**ఆ గ్రామాల్లో...**

నరసన్నపేట మండలం బాలసీమ పంచాయతీ బసివలస, ఉర్లాం పంచాయతీ చింతువానిపేట, వివిఎన్‌పురం పంచాయతీ గోకయ్యవలస, చోడవరం, సుందరాపురం గ్రామాల ప్రజలకు భోగి పండగ అంటే ఏమిటో తెలియదు. బసివలసలో వందేళ్ల కిందట జరిగిన ఘర్షణ నేపథ్యంలో భోగిపండగ నిషేధించామని గ్రామ ప్రజలు చెబుతున్నారు. ముక్కనుమ పండగ రోజు జరిగే కొమ్ముల (ఆవులను పూజించే) పండగ కూడా జరుపుకోరు. చింతువానిపేటలో కూడా భోగి పండగను జరుపుకోరు. కారణం ఏమిటన్నది ఎవరికీ తెలియదు. వివిఎన్‌పురం పంచాయతీ గోకయ్యవలసలోనూ భోగి పండుగ జరుపుకోరు. భోగిమంటలు వెలిగించరు.

**ఆ గ్రామాలదీ అదే దారి**

సంతబొమ్మాళి మండలంలో యమాలపేట, చెట్లతాండ్ర, నౌపడ పంచాయతీలోని పాలనాయుడుపేటలోనూ భోగి పండగ చేసుకోరు. భోగి మంటలు వేస్తే ఆ గ్రామాల్లో ఏదో ఒక వింత అనుభవాలు ఎదురవుతుందన్న ప్రచారం బాగా ఉంది. యామాలపేటలో పూర్వీకులు ఒకసారి భోగి మంట వేస్తే, గ్రామంలోని పూరిపాకలు అంటుకుని భారీ అగ్ని ప్రమాదం సంభవించిందని గ్రామస్తులు చెప్తున్నారు. అప్పట్నుంచి ఆ గ్రామంలో భోగి మంటలు వేయడం ఆపేశారు. దాన్నే నేటికీ కొనసాగిస్తున్నారు.

చెట్లతాండ్రలో పూర్వం భోగి మంటలు వెలిగిస్తే, దాని నుంచి వచ్చిన పొగ గ్రామ సమీపంలోని కొండ పైకి వెళ్లేది. ఆ పొగతో కొండపై ఉన్న పులి భయపడి గ్రామంలోకి చొరబడేదన్న ప్రచారం ఉంది. దీంతో గ్రామంలో భోగి మంట వేయడం మానేశారు. నౌపడ పంచాయతీ పాలనాయుడుపేటలోనూ భోగి మంటకు దూరంగా ఉన్నారు.

**లక్ష్మీపురంలోనూ అదే పరిస్థితి**

పలాస మండలం లక్ష్మీపురం గ్రామం కూడా కొద్ది సంవత్సరాలుగా భోగి పండగకు దూరంగా ఉంటోంది. కొన్ని సంవత్సరాల క్రితం గ్రామంలో భోగి మంటలు వేస్తుండగా ఎక్కడ నుంచో వచ్చిన జంతువు మంటలో పడిపోయి మృతి చెందినట్లు గ్రామస్తులు చెప్తున్నారు. అప్పట్నుంచి ఆ గ్రామంలో భోగి మంటలు ఆపేశారు. ఇవి అప్పట్లో యాధృచ్ఛికంగా జరిగినా, సాంకేతిక విజ్ఞానం పెరిగిన ప్రస్తుత రోజుల్లోనూ అటువంటి నమ్మకాలను ప్రస్తుత తరం పటాపంచలు చేయాల్సిన అవసరం ఉంది.

మరిన్ని వార్తల కోసం epaper.prajasakti.com

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి శివరాం రెడ్డి

## పరీక్షా కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఈనెల 22వ తేదీన పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షకు సంబంధించి కోటబొమ్మాళిలోని పరీక్షా కేంద్రాలను కాశీబుగ్గ డిఎస్‌పి ఎం.శివరాం రెడ్డి టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళితో కలిసి శనివారం పరిశీలించారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార విద్యాసంస్థలో రెండు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, విక్టరీ విద్యాసంస్థలో ఒకటి చొప్పున పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ ఖాదర్‌భాషా, వంశధార విద్యాసంస్థల కరస్పాండెంట్ చింతాడ అనిరుద్దుడు తదితరులు పాల్గొన్నారు.

**In the Honourable court of thePrincipal Senior Civil Judge at Srikakulam**
**IA 352/2022 in IA 58/2022 in OS58/2011**

Between:
**Konada. Kurma Rao.** --Plaintiff
And
**Konada JaggaRao** and others --Defendants

To
**R5 Konada Sudheer,** S/o Late Kameswara Rao,Resident of K.Matsyalesam Hamlet of Calingapatnam,GaraMandalam, Srikakulam District.
**R6 Konada Swetha,** w/o Vasupilli. Gangadhar D/o Late Kameswara Rao.
-Restdo-

**NOTICE**
Please take this Notice in the above matter is posted to **30/01/2023** for your appearance. You are here by directed to appear before the above court at **10.30AM on 30/01/2023** in Person or through advocate with out fail. other wise the matter will be decided in your absence.
**By court order**

**PALISETTI.MURALIKRISHNA**
**Advocate,**
**Newcolony,**
**Srikakulam 9440371133**

**BEFORE THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, TEKKALI. O.S. 29/2020**

**Between:** BANK OF INDIA, TEKKALI BRANCH, Represented by it's Branch Manager, TEKKALI Village/Mandal in Srikakulam District. ... Plaintiff.

**And: POTHULA CHANDARRAO**
... Defendant.

**NOTICE TO THE SAID DEFENDANT**
Pothula Chandarrao, S/o Jagannadha Rao, At present aged about 60 years, Hindu, Door No. 6-180, Srinivasa Nagar, Tekkali Vill / Post / Mandalam,Pin Code - 532 201.Srikakulam District.

It is to inform you that the above said case/matter/suit i.e., **O.S.29/2020** on the file of the Honourable Court of Junior Civil Judge, Tekkali in Srikakulam District is stands posted to dt: **19-01-2023** for your APPEARANCE, and you are to appear on the above said date before the said Honourable Court at 10:30 AM, in person or through your pleader/advocate, otherwise the above matter/case/suit will be decided against you. Hence, this notice.
**// By order of the said Honourable Court //**

**KAJANA VENKATARAO,**
Advocate for the Plaintiff,
TEKKALI,
**Cell No: 9440196244.**
**Tekkali**
**Dated 14-01-2023.**

## జాతీయస్థాయి పోటీలకు పలాస క్రీడాకారుడు

**ప్రజాశక్తి - పలాస**

పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి చదువుతున్న బొమ్మాళి సిద్ధార్థ టెన్నికాయిట్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 11, 12 తేదీల్లో అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో మూడోస్థానం సాధించి ఈ అర్హతను పొందాడు. ఈ పోటీలో పదోతరగతి విద్యార్థి లండ రాజు బెస్ట్ 8లో స్థానం పొంది, శిక్షణ శిబిరానికి ఎంపికయ్యాడు. పాఠశాల పీడీలు పి.తవిటయ్య, బి.శంకరరావు మెలకువలు నేర్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.తులసీరావు, ఉపాధ్యాయులు అభినందించారు. జాతీయ పోటీలు ఈ నెల 22 నుంచి 26 వరకూ అనకాపల్లిలో జరుగుతాయని తవిటయ్య చెప్పారు. ఈ నెల 16 నుంచి 21 వరకూ పలాస మైదానంలో శిక్షణ శిబిరం జరుగుతుందని పిఇటి తెలిపారు.

## తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**టెక్కలి:** ఈ నెల 6, 7, 8, తేదీల్లో తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్లో జరిగిన సౌత్ ఇండియా తైక్వాండో పోటీల్లో టెక్కలికి చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని కోచ్ నర్సింహరావు శేఖర్ శనివారం తెలిపారు. తమ సంస్థ నుంచి 16 మంది విద్యార్థులు పాల్గొని, వివిధ కేటగిరీల్లో పలు పతకాలు సాధించారని తెలిపారు. విజేతలను శేఖర్ అభినందించారు.

## క్రీడలపై యువత ఆసక్తి

**ప్రజాశక్తి - పలాస**

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తిరుపతిరావు

యువత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలని, భవిష్యత్లో ఈ క్రీడలే ఎంతోగానో ఉపయోగపడతాయని వైసిపి మండల ప్రధాన కార్యదర్శి, నీలావతి సర్పంచ్ ప్రతినిధి సొర్రా తిరుపతిరావు అన్నారు. మండలంలోని చిన్న నీలావతి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా శనివారం అభ్యుదయ యువజన సంఘం ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఎక్కడ పోటీలు జరిగిన విరివిగా పాల్గొనడం వల్ల తమ ప్రతిభ బయటపడుతుందన్నారు. భవిష్యత్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొనేందుకు అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ యువజన సంఘం అధ్యక్షులు లోకేష్, పుచ్చ మహేష్, సోమయ్య, పుచ్చ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న త్యాగరాజ ఉత్సవాలు

**ఇచ్ఛాపురం:** వైభవంగా త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలు ఇచ్ఛాపురం మండలం టి.బరంపురం గ్రామ పంచాయతీలో సంగీత జగద్గురు శ్రీ త్యాగరాజు స్వామి 176 ఆరాధన ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఏర్పాటు చేశారు. ఉదయం స్వామివారి తిరువీధి కార్యక్రమం మేళతాళాలతో నిర్వహించారు. డాక్టర్ మావుడూరు సత్యనారాయణశర్మ, ఆల్ ఇండియా కళారంగం ఆంధ్రప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తిప్పన ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో పంచరత్న బృందగానాన్ని నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాలను విచ్చేసినటువంటి కళాకారులతో త్యాగరాజ కీర్తన యజ్ఞాన్ని ఏర్పాటు చేశారు. చలపాయం వాణిశ్రీతో గాత్ర కచేరి, మావుడూరు సత్యనారాయణ వయోలిన్ సోలో కచేరి శ్రోతలను ఎంతో మంత్రముగ్ధులను చేసింది. కార్యక్రమంలో సర్పంచ్ కారంగి త్రినాథ్రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు సర్ల నరేంద్ర, బిజెపి అధ్యక్షులు మనోరంజన్ సంత్ర, పాత్రపుం ట్రాక్ చైర్మన్ ఎదురు మోహన్రావు నవగం సర్పంచ్ బొంకయ్య, ఏకాంబరం మాస్టారు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సామాన్లు అప్పగింత

**శ్రీకాకుళం అర్బన్:** పలాస మండలం పద్మనాభపురం కాలనీలో నివాస ముంటున్న ఆర్టి నరేష్, తన సహచరులతో కలిసి బొంబాయి నుంచి శ్రీకాకుళం వస్తూ రాజాంలో బస్ దిగాడు. ఆ సమయంలో బస్ వెళ్లి పోవడంతో తన లగేజీ కోసం ఆర్టీసి ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. వారి ద్వారా కండక్టరు ఫోన్ నంబరుకు సమాచారం అందివ్వడంతో ఆయన సామాన్లను కండక్టరు వి.రమేష్ భద్రపరచి, శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజరు వి.శామ్యూల్కు అప్పగించాడు. బాధితుడు నరేష్ శనివారం తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం చేరుకున్నారు. ఆయన పోగొట్టుకున్న సామాన్లను ఆర్టీసీ సిబ్బంది తిరిగి అందజేశారు.

## సంక్షిప్త వార్తలు

### స్టడీ మెటీరియల్ పంపిణీ

**ప్రజాశక్తి-రణస్థలం**

పుస్తకాలు పంపిణీ చేస్తున్న అప్పలనాయుడు

మండల కేంద్రంలో నిఖిల కలిశెట్టి విద్య, వైద్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఉచిత శిక్షణ శిబిరంలో విద్యార్థులకు 3000 పేజీలుగల తొమ్మిది పుస్తకాలతో కూడిన స్టడీమెటీరియల్ని శనివారం ఎచ్చెర్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, శిక్షణా తరగతుల మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులకు పోటీ పరీక్షల్లో ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని, భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ రాబోయే పరీక్షల్లో అందరూ మంచి ఫలితాలు సాధించాలని కోరారు.

### ఊరెళ్తున్నారా.. సమాచారం ఇవ్వండి

**ప్రజాశక్తి-రణస్థలం**

సంక్రాంతి పండగకు ఊరెళ్లేవారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని జెఆర్పురం సబ్ ఇన్స్పెక్టర్ జి.రాజేష్ కోరారు. తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగలు పడే అవకాశం ఉన్నందున ప్రజలు క్యాంపు వెళ్లినట్లు సమాచారం ఇస్తే వారి ఇళ్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. క్యాంపు వెళ్తున్నట్లు సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని, దొంగలు వాటిని చూసి దొంగతనాలు చేసే అవకావముందని సూచించారు. ఇళ్లలో నగదు, బంగారు, వెండి ఆభరణాలు ఉంచవద్దని తెలిపారు. సెంట్రల్లాక్ సిస్టమ్ గల తాళాన్ని ఇళ్లలో అమర్చుకోవడం ఉత్తమమని అన్నారు. మీ కాలనీలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇళ్లలో అమర్చిన సిసి కెమెరాలు పుటేజీని ఎప్పటికప్పుడు ఫోన్లో చూసుకుంటే మంచిదన్నారు. ఇళ్ల ముందు న్యూస్ పేపరు, పాల పేపరు గంటల తరబడి ఉండకుండా చూసుకోవాలని అన్నారు. లేకుంటే సెక్యూరిటీ గార్డు, వాచ్మెన్ను నియమించుకోవాలని కోరారు.

### లఘుచిత్రం ఆవిష్కరణ

**సోంపేట:** మండలంలోని కొర్లం గ్రామానికి చెందిన యువకులు నిర్మించిన మోటివేషన్ లఘు చిత్రం 'జీవితం వెక్కిరించింది' శనివారం ఆవిష్కరించారు. గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి, భోగి వేడుకల్లో స్థానిక పెద్దల సమక్షంలో ఈ చిత్రాన్ని యువకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో యువత చెడు వ్యసనాలకులోనై బానిసలుగా మారి తమ భవిష్యత్ను ఏ విధంగా అంధకారం చేసుకుంటున్నారో చిత్రంలో చూపించడం జరిగిందన్నారు. చిత్ర నిర్మాణానికి సహకరించిన పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

### విద్యుత్ లైట్ల ఏర్పాటు

లైటును ఏర్పాటు చేస్తున్న లైన్మెన్

**సంతబొమ్మాళి:** జగన్నాథపురం పంచాయతీలో సర్పంచ్ జోగి రాములమ్మ ఆధ్వర్యంలో విద్యుత్ లైట్లు శనివారం ఏర్పాటు చేశారు. సంక్రాంతి సందర్భంగా గ్రామంలో అన్ని వీధుల్లో లైట్లు ఏర్పాటు చేయడం వల్ల ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండడానికి వీధిలైట్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు పుక్కళ్ళ లక్ష్మణరావు, లైన్మెన్ , జెఎల్ఎం పాల్గొన్నారు.

### డిడిలు కట్టాక సరుకులు ఇవ్వకపోతే ఎలా?
### రేషన్ డీలర్ల ఆవేదన

**సంతబొమ్మాళి:** సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు సంబంధించి సుమారు 96 మంది రేషన్ డీలర్లతో పండగ నెలలో పప్పు, పంచదార తప్పనిసరిగా విడిపించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని చెప్పి అధికారులు డిడిలు కట్టించుకొని, తీరా సరుకులు ఇవ్వలేదని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీలర్ల అందరిపై ఒత్తిడి చేసి సుమారు 70మంది అప్పుచేసి సుమారు రూ.20లక్షలు డిసెంబరు నెలలో కట్టారని తెలిపారు. తీరా పండకు వీటిని సరఫరా చేయకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్లు కట్టిన డబ్బులు తిరిగి రావాలంటే సరుకులు తీసుకోవడమే తప్ప మరో మార్గం లేదని వాపోయారు. ఈ సమస్యపై ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నిరసన తెలిపగా, పండగ ముందు పంచదార, పప్పు ఇస్తామని జిల్లా డిఎం భరోసా ఇచ్చారని, భోగి వచ్చినా సరుకులు ఎక్కడ? అని ప్రశ్నించారు. కోటబొమ్మాళి ఎంఎల్ఎస్ పాయింట్కు కందిపప్పు, పంచదార రాకుండా వచ్చినట్లు ఓ పత్రికలో వార్తలు రాయించి చేతులు దులుపుకున్నారని వాపోయారు. ఆ పత్రిక చూసిన వారంతా కందిపప్పు, పంచదార ఎప్పుడిస్తారని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. అధికారులు మాత్రం తాము డీడీలు తీయనందునే పప్పు, పంచదార రాలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని తెలిపారు.పండగ పోయిన తరువాతైన పప్పు, పంచదారా వచ్చేలా చూడాలని, లేకుంటేఆందోళన తీవ్రతరం చేస్తామని ప్రకటనలో పేర్కొన్నారు.

# ఘనంగా భోగి వేడుకలు

భోగి ఉత్సవాల్లో శ్రీనివాస పట్నాయక్

**ప్రజాశక్తి-రణస్థలం**

భోగి పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. శనివారం వేకువజాము నుంచే వీధివీధిలో భోగి మంటలు వేశారు. పశువుల పేడతో చేసిన భోగి పిడకలను మంటల్లో వేస్తూ పిల్లలు పెద్దలు ఆనందంగా గడిపారు. మండలంలోని పలు గ్రామాల్లో భోగి పండగతో సందడి వాతావరణం నెలకొంది. చిన్నా పెద్దా అందరూ ఉత్సాహంతో పండుగను జరుపుకున్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉదయం వేళ గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలతో గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ సంక్రాంతి శోభకు మరింత వన్నె తెచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో సంసతి సంప్రదాయాలను గుర్తు చేసేలా చిన్నారులు పట్టు వస్త్రాలు ధరించి, ప్రాచీన ఆటలు ఆడుతూ పండగ చేసుకున్నారు. పలు ప్రాంతాల్లో క్రీడా పోటీలను నిర్వహించారు. సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారు స్వగ్రామాలకు రావడంతో పండగ శోభ సంతరించుకుంది.

**లావేరు:** మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం వేకువజాము నుంచే భోగి పండగ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా భోగి మంటలు వేశారు. పేడతో చేసిన పిడకలు మంటల్లో వేసి, సంబరాలు జరిపారు.

**వజ్రపుకొత్తూరు:** భోగి పండగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. గోవిందపురం, గరుడభద్ర, డోకులపాడు, నగరంపల్లి, చిన్నవంక, తదితర గ్రామాల్లో భోగి మంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గరుడభద్రలో ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు గూడ ఈశ్వరరావు, వడ్డీ కరుణాకర్, పిఎసిఎస్ అధ్యక్షుడు దువ్వాడ మధుకేశ్వరరావు, దువ్వాడ హేంబాబుచౌదరి, టిడిపి నాయకులు పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, గొరకల విఘ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

**కోటబొమ్మాళి:** మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం భోగి మంటలు వెలుతురులతో గ్రామాలు కళకళలాడాయి. తెల్లవారు జామునే యువకులు, పెద్దలు కలిసి వీధుల్లో భోగి మంటలు వేశారు. యువకులు ఈ పండగ కోసం వారం రోజులు ముందుగానే కట్టెలు, పిడకలు సేకరించారు. భోగి మంటలో వేశారు. మండలంలోని ఊడికలపాడు, కోటబొమ్మాళి, దంత, కురుడు, హరిశ్చంద్రపురం, లఖందిడ్డి, గంగరాం, యలమంచలి, పాకివలస, శ్రీజగన్నాథపురం, నిమ్మాడ, తిలారు, తదితర గ్రామాల్లో భోగి నిర్వహించారు.

**సాంప్రదాయాల పరిరక్షణకు కృషి**
**ఫిజియో థెరపిస్టు శ్రీనివాస పట్నాయక్**

**శ్రీకాకుళం అర్బన్:** సాంప్రదాయాలను నేటి తరం పరిరక్షించాలని దక్షిణ భారత హిందీ కార్యదర్శి, ఫిజియో థెరపిస్టు డాక్టరు శ్రీనివాస పట్నాయక్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని పాత హౌసింగ్బోర్డు కాలనీలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా భోగి మంటలు వేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో మాజీ కౌన్సిలర్ కర్నేని పద్మావతి, కె.హరిబాబు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

**స్టార్ వాకర్స్ ఆధ్వర్యాన..**

భారతీయులకు ఎంతో ప్రాధాన్యమైన పండగ భోగి అని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం భోగి సందర్భంగా ఆర్ట్స్ కళాశాల

కోటబొమ్మాళి : భోగి మంటలు వేస్తున్న యువకులు

ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్, ఆర్ట్స్ కళాశాల బృందం సంయుక్త నిర్వహణలో భోగి మంటలు వేశారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలు మర్చిపోకుండా ఉండేందుకు ఇట్లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. తొలిపంట ఇంటికి చేరి, రైతన్నలు హృదయాల్లో ఆనందాలు విహరింపజేస్తుందని అన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జోగినాయుడు మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే భోగి, సంక్రాంతి, కనుమను ప్రజలు సంప్రదాయబద్ధంగా చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిజి.గుప్తా, టి.శ్రీభార్గవి, డాక్టర్ కె.పాండురంగారావు,ఎ.రవికుమార్, జి.వెంకటప్పలనాయుడు, ఎం.మల్లిబాబు, జి.ఉమామహేశ్వరరావు, సంతోష్, అశోక్, రమేష్బాబు, తదితరులు పాల్గొన్నారు.

**మారుతీవాకర్స్ ఆధ్వర్యాన**

మారుతీ వాకర్స్ ఆధ్వర్యంలో భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మారుతీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు, వాకర్స్ 102 డిప్యూటీ గవర్నర్ కొంక్యాన మురళీధర్ ఆధ్వరాన నగరంలోని విశాఖ-బి కాలనీలోని గౌతమ్ నగర్లో భోగి మంట వేశారు. మురళీధర్ మాట్లాడుతూ సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలు మానవ జీవితాన్ని సత్య మార్గంలో తీసుకెళ్లేందుకు సంక్రాంతి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రెస్క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, మారుతీ వాకర్స్క్లబ్ కార్యదర్శి పొట్నూరు నాగేశ్వరరావు, కోశాధికారి పి.నారాయణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేంద్రప్రసాద్, పొట్నూరు రమేష్, బైరెడ్డి శంకరరావు కాలనీ పెద్దలు, యువత పాల్గొన్నారు.

# పేదలకు దుస్తుల పంపిణీ

**ప్రజాశక్తి - రణస్థలం**

రణస్థలం పంచాయతీలో నిరుపేదలకు సర్పంచ్ల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పిన్నింటి వెంకట భానోజీనాయుడు దుస్తులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రణస్థలం పంచాయతీలోని ప్రతి పేదవాడు ఆనందోత్సవాలతో సంక్రాంతి సంబరాలు జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఇఒ పిన్నింటి సూర్యనారాయణ, ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకట రమణ, వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

**యువతకు టీ షర్ట్స్ పంపిణీ**

**పొందూరు:** మండలంలోని బురిడికంచరాం మాజీ సర్పంచ్ వండానా లక్ష్మీనాయుడు గ్రామానికి చెందిన యువతకు 150 టీషర్టులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వండాన కిరణ్కుమార్, వండాన లక్ష్మీపతి, పి.అప్పలనాయుడు, లంక వెంకన్న, లంక శివ, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : దుస్తులు పంపిణీ చేస్తున్న భానోజీరావు

దుస్తులను పంపిణీ చేస్తున్న రజని, ఎన్ఇఆర్

**నౌపడ:** సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామంలో స్పందన యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరుపేద వృద్ధులకు సంఘ సభ్యులు దుస్తులు అందజేశారు. వీటితోపాటు రూ.900 విలువ గల నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నడిమింటి నాగరాజు, పిలక రాజశేఖర్ రెడ్డి, లోపింటి జయ కష్ణారెడ్డి, షావుకారి నర్సింగరావు, అందవరపు రమేష్, మేరువ కోదండరావు, నిర్వాణి భాస్కర్ దాస్, పరపటి నారాయణ, సిమ్మయ్య, మహంతి రాజు,తదితరులు పాల్గొన్నారు.

**ఎన్ఇఆర్ క్యాంపస్లో..**

**రణస్థలం రూరల్:** మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెం ఎన్ఇఆర్ క్యాంపస్ వద్ద బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్), సర్పంచ్ రజని ఆధ్వర్యంలో సంక్రాంతిని పురస్కరించుకొని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహాలక్ష్మి అప్పలకొండ, ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యా సంస్థల డైరెక్టర్ ఎన్.తేజ, ఎంపిటిసి టి.సంజీవరావు, మాజీ ఎంపిటిసి గురాల రఘునాథ్, గోపిన కృష్ణారావు, గోవిందాసు త్రినాథరావు , తదితరులు పాల్గున్నారు.

**కోటబొమ్మాళి:** మండలంలోని శ్రీజగన్నాథపురం సర్పంచ్ నూక సత్యరాజు తల్లిదండ్రులు జ్ఞాపకార్థం పేదలు, వృద్ధులకు శనివారం దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమారు 150 మందికి సంక్రాంతిని పురస్కరించుకొని చీరలు, పంచెలు, దుప్పట్లతో పాటు కొంత నగదును పంపిణీ చేశారు. భోజనం అందించారు. ప్రతి ఏటా భోగీ పండగ నాడు తనవంతు సహాయంగా చీరలు, దుప్పట్లు పేదలకు పంపిణీ చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు.

శ్రీకాకుళం : దుస్తులను పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

**శ్రీకాకుళం అర్బన్:** సంక్రాంతిని పురస్కరించుకొని నగరంలోని డిసిసిబి కాలనీలో పేదలకు సాయి ఇన్ఫ్రా డెవెలపర్స్ డైరెక్టర్ తమ్మినేని సత్యనారాయణ, బిర్లంగి రామ్మోహన్రావు శనివారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన ప్రతి కుటుంబ ఆనందంగా ఉండాన్నారు. పేదల ఇంట కూడా పండగ జరుపుకోవాలన్నదే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పైడి నిర్మల్కుమార్, గొప్పు సంతోష్, బమ్మిడి రమేష్, గురుగుబెల్లి రామన్న, బుడుమురు శ్రీరాములు, తమ్మినేని రామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

**పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ**

**పలాస:** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పలాస లయన్స్ క్లబ్ క్యాజు ల్యాండ్ వనిత ఆధ్వర్యంలో అంధవరపు నాగేశ్వరరావు సతీమణి మంగ జ్ఞాపకార్ధం శనివారం నిరు పేదలకు నెలకు సరిపడే బియ్యం, కిరాణా సామాన్లుతో పాటు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలాస లయన్స్ క్లబ్ క్యాజు ల్యాండ్ వనిత అధ్యక్షురాలు మల్లా జయశ్రీ, కార్యదర్శి తర్లనా శ్వేత కుమారి, టంకాల శ్రీదేవి, మంజు పాల్గొన్నారు.

5కె రన్ను ప్రారంభిస్తున్న జి.రామారావు, రమేష్నాయుడు

# యువతకు పరుగు అవసరం

- అనకాపల్లి డిపిఒ గేదెల రామారావు
- రంగోయిలో 5కె రన్

**ప్రజాశక్తి - పలాస**

యువతకు పరుగు అవసరమని, నిరంతరం రన్నింగ్ చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అనకాపల్లి రెవెన్యూ జిల్లా ప్లానింగ్ అధికారి గేదెల రామారావు, పలాస ఎంపిడిఒ ఎన్.రమేష్నాయుడు అన్నారు. మండలంలోని రంగోయి గ్రామంలో ఉద్దాన ప్రాంత విద్య అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో పలాస నియోజకవర్గం పరిధిలో సంక్రాంతి సందర్భంగా శనివారం రంగోయి రైల్వే గేట్ నుంచి నీలావతి గ్రంథాలయం వరకు 5కె రన్ నిర్వహించారు. ముందుగా గేదెల రామారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మనిషి మానసిక, శారీరిక ఆనందానికి దోహదపడతాయన్నారు. విద్యాతో పాటు క్రీడలు విద్యార్థులకు అవసరమని, పోటీ ప్రపంచంలో డిఫెన్స్ పోలీస్ ఇతర పరీక్షలకు ఎంతో అవసరమవుతుందన్నారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బొనెల గోపాల్ మాట్లాడుతూ పర్యావరణ కోసం మొక్కలు నాటండి వాటిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో యువివి అధ్యక్షుడు ఇసాకోటి జోగారావు, ప్రధాన కార్యదర్శి బొడ్డు చిన్నారావు, కోశాధికారి యంపల్లి.కామేశ్వరరావు గౌరవ అధ్యక్షులు బత్తిని ఓంకార్ మాస్టర్, రెయ్య కృష్ణారావు, తెప్పల వాసుదేవరావు, పాలిన కృ ష్ణారావు, పి.బాలరాజు, కె.సుధాకర్, జి.లోకేశ్వరవు, సైని.మధు, టి.అజయ్ కుమార్, ఎస్ .డిల్లీశ్వర రావు, వల్లభరావు, ఖగేశ్వరరావు, మహేష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

**విజేతలు వీరే..**

మందస మండలం లోహరిబంద గ్రామానికి చెందిన అందాల శ్యామ్ సుందర్ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈయనకు రూ. 3016లు నగదు, షీల్డ్, కవిటి మండలం సిగలపుట్టిగ గ్రామానికి చెందిన యంపల్లి శ్యామ్ సుందర్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. రూ.2516లు షీల్డ్, పలాస మండలం చిన్న నీలావతి గ్రామానికి చెందిన సొర్రా నవీన్ తృతీయ స్థానంలో నిలవగా రూ.2016లు, షీల్డ్, పలాస మండలం బ్రాహ్మణతర్ల గ్రామానికి చెందిన పి.జోగారావు నాలుగో స్థానంలో నిలిచి. రూ.1516లు, షీల్డ్, ఐదో స్థానంలో నిలిచిన గుడ్డిభద్ర గ్రామానికి చెందిన దున్న దుర్గాప్రసాద్ రూ.1016లు షీల్డ్ను రామారావు, ఎన్.రమేష్నాయుడు అందజేశారు.

సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న డిఎస్పి

## సిసి కెమెరాలు ప్రారంభం

**ప్రజాశక్తి - టెక్కలి రూరల్**

డివిజన్ కేంద్రమైన టెక్కలి ఇందిరాగాంధీ కూడలి వద్ద శనివారం సిసి కెమెరాలను డిఎస్పి శివరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతక పరిజ్ఞానంతో క్రైమ్ రేటు తగ్గించడానికి ఇవి దోహదపడతాయని అన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. గతంలో కంటే సాంకేత పరిజ్ఞానంతో నిందితులను పట్టుకోవడానికి సులువుగా ఉందదన్నారు. కార్యక్రమంలో సిఐ ఎస్.సూర్య చంద్రమౌళి, ఎస్ఐ ఎల్.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పలాస : మార్పు పద్మనాభం వర్ధంతి వేడుకలో నాయకులు

# పద్మనాభం ఆశయ సాధనకు కృషి

**ప్రజాశక్తి - పలాస**

తొలితరం కమ్యునిస్టు నాయకులు మార్పు పద్మనాభం ఆశయాల సాధనకు కృషి చేయాలని పలువురు వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని బొడ్డపాడు గ్రామం అమరవీరుల స్మారక మందిరం వద్ద శనివారం పద్మనాభం 57వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. లిబరేషన్ నాయకులు మద్దిల రామారావు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పొరేట్లకు దారాదత్తం చేయడానికి వ్యతిరేకంగా రైతాంగాన్ని సమీకరించి పోరాటం చేయడమే మార్పు పద్మనాభంకు నిజమైన నివాళులు అర్పించిన వాళ్లం అవుతామన్నారు. మార్పు పద్మనాభం విజ్ఞాన కేంద్రం పలాస లో ఏర్పాటు చేయాలని పలుమార్లు స్థానిక మంత్రి సీదిరి అప్పలరాజుకి వినతిపత్రం సమర్పించామని తెలిపారు. విజ్ఞాన కేంద్రాన్ని తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వంకల మాధవరావు, లిబరేషన్ రాష్ట్ర నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, మద్దిల రామారావు, వినోద్, బాలక్రిష్ణ, సిహెచ్ రవి, వై మురళి పిన్నింటి నాగేశ్వరరావు, దుష్యంత్, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

**వజ్రపుకొత్తూరు:** ప్రజా పోరాటాలే మార్పు పద్మనాభంకు నిజమైన నివాళులని సిపిఎం నాయకులు బి.ఆనందరావు అన్నారు. శనివారం నగరంపల్లిలో టి.భాస్కరరావు అధ్యక్షతన మార్పు పద్మనాభం వర్ధంతి సభ నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు బి.ఆనందరావు, ఎన్.చంద్రయ్య పద్మనాభవం చిత్రపటానికి పూలమాలేసి, నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ పద్మనాభం ఆశించిన ఆశయం నెరవేర్చడం మనముందున్న కర్తవ్యం అని అన్నారు. సిపిఎం మండల కన్వీనరు ఎన్.మోహనరావు, బి.శ్రీరాములు మాట్లాడుతూ రైతు సమస్యలపై ఈయన పోరాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బి.రామకృష్ణ, టి.సుధాకర్, ఎస్.మల్లేసు, ఎస్.లీలామోహన్, టి.లక్ష్మి, ఎస్.జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఆదర్శ రైతులతో రోటరీ క్లబ్ అధ్యక్షులు పాత్రుని పాపారావు

## ఆదర్శ రైతులకు రైతుమిత్ర పురస్కారాలు

**ప్రజాశక్తి - ఆమదాలవలస**

మండలంలోని కొర్లకోట గ్రామంలో పదిమంది ఆదర్శ రైతులకు రైతు మిత్ర పురస్కారాలను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆ అధ్యక్షులు పాత్రుని పాపారావు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆదరించే ప్రభుత్వాలు రావాలని రైతును రారాజుగా చేసిననాడు భారతదేశం సుభిక్షం అవుతుందని అన్నారు. అనంతరం ఆదర్శ రైతులు పాత్రుని నరసింహులు, పేడాడ అప్పలనాయుడు, నక్క దామోదరరావు, తమ్మిన లక్ష్మీనారాయణ, పాత్రుని భాస్కరరావు, సనపల చెల్లంనాయుడు, పేడాడ లక్ష్మున్నాయుడు, పైడి జగన్నాథం, గురుగుబెల్లి రాజారావు, అన్నెపు అప్పారావును సత్కరించి, పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి తేజ లక్ష్మి, పేడాడ వెంకటప్రతాప్కుమార్, సనపల ఢిల్లేశ్వరరావు, అప్పలనాయుడు, పేడాడ వైకుంఠరావు, సనపల అన్నాజీరావు, అన్నెపు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కేలండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు**

కేలండర్ను ఆవిష్కరిస్తున్న గౌతు శివాజీ

టిడిపి నూతన సంవత్సరం 2023 కేలండరును మాజీ మంత్రి గౌత శ్యాంసుందర్ శివాజీ శనివారం ఆవిష్కరించారు. శనివారం భోగి పండుగ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ముద్రించిన నూతన సంవత్సర కేలండరును ఆవిష్కరించారు. కొత్త ఏడాది తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా ఉంటుందని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కుటుంబ సభ్యులుగా తమకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటూ సహకరిస్తున్నారని అన్నారు. కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకు సాగి, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సూరత్ మోహన్రావు మాజీ ఎంపిపి గొరకల వసంతరావు, టిడిపి సీనియర్ నాయకులు శశిభూషణ్, సాంబమూర్తి, కోణారి కిరణ్కుమార్, బాలకృష్ణ, దుర్యోధన, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

**టెక్కలి రూరల్:** మెళియాపుట్టి మండలం సవర బాణాపురం గ్రామానికి చెందిన సవర మోహనరావు, సునీత దంపతుల పెద్దకుమార్తె ఉమశ్రీ చలిమంట వద్ద ప్రమాదవశాత్తు గాయపడింది. రాగోలు జేమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న అభయం యువజన సేవా సంఘం సభ్యులు రూ.20వేలు అందించినట్లు సేవాసంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇలా ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో ముందుకొస్తే నిరుపేదలను ఆపద సమయాల్లో ఆదుకోవచ్చని, ఈ పండగ సమయం ఒక బీద గిరిజన కుటుంబాన్ని ఆదుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అభయం సేవా సంఘం సభ్యులు వాకాడ ఉమామహేశ్వరరావు, జోగి ఆదినారాయణ పాల్గొన్నారు.

నగదును అందిస్తున్న అభయం యువజన సేవా సంఘం సభ్యులు

## లావేరు ఎంపిడిఒగా సురేష్ కుమార్

**ప్రజాశక్తి - లావేరు**

బాధ్యతలు చేపట్టిన సురేష్కుమార్

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కుప్పిలి సురేష్కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు డెప్యుటేషన్పై వచ్చిన ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సహాయ సహకారాలతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. పంచాయతీల అభివృద్ధి, ఉపాధి హామీ ద్వారా అందరికీ ఉపాధి కల్పినపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు.

## ఆకట్టుకున్న అయ్యప్ప చిత్రం

**ప్రజాశక్తి - పలాస**
మున్సిపాలిటీలోని 21వ వార్డు అవతార్ మోహర్‌బాబా నగర్‌లో నివాసం ఉంటున్న సూక్ష్మ కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారి అయ్యప్పస్వామి చిత్రంను ఎ4 పేపరుపై తయారు చేసి, అబ్బురపరిచాడు. సర్జికల్‌బ్లేడు సహాయంతో చూడచక్కగా మల్చిన తీరు అమోఘమని పలువురు మెచ్చుకున్నారు.

## గాలిపటాల పోటీలు

**ప్రజాశక్తి - ఇచ్ఛాపురం**
పట్టణంలోని బెల్లుపడా త్రినాథ్ స్వామి ఆలయం కొండపై శనివారం కనుమ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ప్రతి ఏటా అత్యంత ఘనంగా మూడు రోజుల పాటు త్రినాథ స్వామి కొండపై కనుమ వేడుకలను ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వహిస్తుంది. శనివారం భోగి పండగ నుంచి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం గాలిపటం పోటీలు నిర్వహించారు. యువత పెద్ద ఎత్తున గాలిపటం పోటీల్లో పాల్గొన్నారు. ఆదివారం సామూహిక త్రినాథ్ స్వామీ మేళా, సోమవారం కనుమ సందర్భంగా ఢీ 15 కొరియోగ్రాఫర్ కుమార్ డ్యాన్స్ మాస్టర్ అధ్వర్యంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ నృత్య ప్రదర్శన జరుగుతుందని కమిటి తెలిపింది. మూడు రోజుల పాటు కొండపై జరిగే ఉత్సవాలకు ప్రజలు, సమీప గ్రామాలు నుండి భారీగా తరలిరానున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆలయ కమిటీ చర్యలు చేపట్టింది.

## ముగిసిన మేలుకొలుపు

**ప్రజాశక్తి - పొందూరు**
మండలంలోని రాపాక గ్రామంలోని భుజన్నగారి వీధిలో నెల రోజులుగా నిర్వహిస్తున్న మేలుకొలుపు జాతర శనివారంతో ముగిసింది. ప్రతి ఏటా కృష్ణుని ప్రతిమతో గీతాలపన చేస్తూ పరిసర గ్రామాల్లో భిక్షాటన చేయడం ఆనవాయితీగా వస్తోంది. భోగి రోజున పలు సాంస్కతిక కార్యక్రమాలతో పాటు నిర్వహించిన అన్నదానానికి పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది హాజరయ్యారు.

**ఆమదాలవలస** : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నెల రోజుల నుంచి వేకువజామున మేలుకొలుపు కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలో కొత్తవలస, దూసిపేట, రామచంద్రపురం, తోటాడ, వంజంగి, శ్రీహరిపురం తదితర గ్రామాలతో పాటు పట్టణంలోని వెంకటేశ్వర స్వామి, లక్ష్మీనారాయణ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఎపి పిజెఎసి వైస్ చైర్మన్‌గా హేమంత్‌కుమార్

హేమంత్ కుమార్

**కోటబొమ్మాళి:** ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ జాయింట్ యాక్షన్ కమిటీ(ఎపి పిజెఎసి) వైస్ చైర్మన్‌గా డాక్టర్ నంబాళ హేమంత్‌కుమార్ నియమితులయ్యారు. ఈయన శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం యలమంచిలి గ్రామానికి చెందిన వ్యక్తి, ఆయన ప్రస్తుతం డాక్టర్ ఆఫ్ ఫార్మసీ అసోసియేషన్ ఇండియన్ ఫార్మసిస్ట్ అసోసియేషన్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ హోదా రెండేళ్ల వరకు ఉంటుంది. హేమంత్ అన్ని అసోసియేషన్ అధ్యక్షులు, వైస్ ప్రెసిడెంట్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## అన్నదానం

**ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు**
పూడి జగన్నాథపురం గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం 2వేల మందికి అన్నదానం నిర్వహించారు. శ్రీ సువర్చలా సహిత అభయాంజనేయస్వామి కళ్యాణ మహోత్సవం వేద పండితులు, యాత్రికుల నడుమ నిర్వహించారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, పగటి వేషాలు సందడి నడుమ దేవతామూర్తులు తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని ప్రసాదరావు, బూరాడ మల్లిబాబు శాస్త్రి, మాజీ సర్పంచ్ తిమ్మల కృష్ణారావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సంగమేశ్వర యాత్రకు సర్వం సిద్ధం

**ప్రజాశక్తి - ఆమదాలవలస**
పట్టణానికి కూతవేటు దూరంలోని గాజుల కొల్లివలస సమీపంలో ఉన్న సంగమేశ్వర స్వామి యాత్రకు ఆలయ కమిటీ నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ప్రతి ఏటా సంక్రాంతి, కనుమ, ముక్కనుమ మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా భారీ ఎత్తున ఇక్కడ యాత్ర జరుగుతుంది. ఈ యాత్రకు జిల్లాలోని పలు ప్రాంతాల నుండి, పక్క జిల్లాలు, ఒడిశా రాష్ట్రం నుండి కూడా అధిక సంఖ్యలో ప్రజలు హాజరవుతారు. కొండపైన బౌద్ధమత ఆనవాళ్లు ఉన్నాయి. ఈ ఆలయాన్ని 12వ శతాబ్దంలో నిర్మించినట్లు పూర్వీకులు చెబుతుంటారు. ఈ ప్రాంతంలో బౌద్ధ, జైన, హిందూ మతాల బోధకులు సంచరించి ప్రచారాలు చేసినట్లు చరిత్ర చెబుతోంది. కొండపైకి సుమారు 160 మెట్లు ఎక్కి సంగమేశ్వర స్వామిని దర్శించుకోవచ్చు. కొండపైన ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రకృతి సోయగాలు వెరసి యాత్రికుల మదిని పులకింపజేస్తాయి. బౌద్ధ విగ్రహాలు నిలువెత్తు దర్శనమిస్తుంటాయి. కార్తీక మాసం, యాత్ర సందర్భంలో యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ప్రాచీన కాలం నాటి ఆలయం ఇప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. గతంలో టిడిపి హయంలో మంత్రిగా నేడు స్పీకర్‌గా పనిచేస్తున్న తమ్మినేని సీతారాం పలుమార్లు పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా మారుస్తానని హామీ ఇచ్చినప్పటికీ అది నేటికీ కార్యరూపం దాల్చలేదని పలువురు గుర్తుచేస్తున్నారు. యాత్ర సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

రద్దీగా ఉన్న వస్త్ర దుకాణం

## టెక్కలిలో సంక్రాంతి శోభ

**ప్రజాశక్తి - టెక్కలి రూరల్**
సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని డివిజన్ కేంద్రమైన టెక్కలిలో శనివారం సందడి వాతావరణం చోటు చేసుకుంది. టెక్కలి మండలంతో పాటు నందిగాం, సంతబొమ్మాళి మండలాల ప్రజలు టెక్కలి చేరుకోవడంతో టెక్కలిలోని ప్రధాన మార్గాలు రద్దీగా మారాయి. ఆర్టీసి కాంప్లెక్స్, తెంబూరు రోడ్డు జంక్షన్, ఇందిరాగాంధీ జంక్షన్, అంబేద్కర్ జంక్షన్ల వద్ద రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సంక్రాంతి సందర్భంగా వివిధ రకాల వస్తువుల కొనుగోలుకు డిమాండ్ ఏర్పడింది. కూరగాయాల దగ్గర నుండి వస్త్ర దుఖాణాల వరకు ప్రతి దుకాణం వద్ద కొనుగోలుదారులతో రద్దీ ఏర్పడటంతో పట్టణంలో పలు చోట్ల ట్రాఫిక్ స్తంభించింది. ఇందిరాగాంధీ, అంబేద్కర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకున్నప్పటికీ ట్రాఫిక్ రద్దీను నియంత్రించ లేకపోయారు. పర్యవసానం ద్విచక్రవాహనాలు, బస్సులు రాకపోకల మధ్య ప్రజలు రాకపోకలకు పలు అవస్థలను ఎదుర్కొన్నారు. పలు చిల్లర దుఖాణాలు రోడ్డు పక్కనే నెలకొల్పడంతో ట్రాఫిక్ రద్దీ మరింతగా ప్రజలకు ఇబ్బందులకు గురిచేశాయి. ఈసారి సంక్రాంతి రైతాంగానికి అనుకూలంగా లేక పోయినప్పటికీ మార్కెట్‌కు సంక్రాంతి శోభ సంతరించుకుంది. వస్త్ర దుఖాణాల వద్ద బారులుతీరి ఖాతాదారులు ఉడడంతో రోడ్లు జనంతో నిండిపోయాయి. ప్రధానంగా రంగులు కొనుగోలు, చెరుకులు, కూరగాయలు, బట్టలు దుఖాణాల వద్ద రద్దీ అధికంగా కనిపించింది. పండగ సందర్భాల్లో పట్టణంలో తీవ్ర ట్రాఫిక్ రద్దీ నెలకొంటున్నప్పటికీ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చెందడం వల్ల పలువురు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## వాలీబాల్ విజేత టెక్కలి

**సోంపేట:** మండలంలోని మామిడిపల్లిలో పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల విజేతగా టెక్కలి జట్టు నిలిచింది. శనివారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన చేతుల మీదుగా విజేతలకు ట్రోఫీల్డ్‌తో పాటు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యువత చేతులలోనే దేశ భవిష్యత్ ఉందని , మంచి మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో ద్వితీయ స్థానంలో మామిడిపల్లి, తృతీయ స్థానంలో బాతుపురం, నాలుగువ స్థానంలో చాపరాయి కాలనీ జట్లు నిలిచాయి.

ట్రోఫీ అందజేస్తున్న లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు

కార్యక్రమంలో రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కోదండ, డిఎస్‌పి లక్ష్మీనారాయణ, సర్పంచ్ శేషగిరి, ఎంపిటిసి డి.మాధవరావు, గ్రామ పెద్దలు జి.నాగేశ్వరరావు, జి.ఈశ్వరరావు, లండ బాబురావు, టి.పాపారావు, జి.దొరబాబు, పాతని ప్రసాద్, జి.సింహాచలం, ఎస్.చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## కలిసి చదువుకుని.. ఆత్మీయత పంచుకుని..

**ప్రజాశక్తి - ఆమదాలవలస**
పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1996-98 సంవత్సరంలో చదువుకున్న అప్పటి విద్యార్థులు అంతా కలసి శనివారం కళాశాల ప్రాంగణంలో ఆత్మీయ సదస్సు నిర్వహించారు. సంక్రాంతి పండగ సందర్భంగా కలిసి చదువుకున్న వారంతా ఒక చోట సమావేశమై ఏడాది పొడుగునా జరిగిన వివిధ సందర్భాలను గుర్తుచేసుకున్నారు. ఆనందంగా గడిపారు. అప్పటి బ్యాచ్‌లోని విద్యార్థి మన్మథరావు ప్రస్తుతం జిల్లా రిజిస్టర్‌గా పనిచేస్తున్నారు. అలాగే మిగిలిన వారు కూడా చిన్న చిన్న వృత్తులు, వ్యాపారాలు, చిరు ఉద్యోగాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నట్లు వారి ఆత్మీయ సమావేశంలో తెలిపారు. జిల్లా రిజిస్టర్‌తో కలిపి చదువుకున్న పూర్వ విద్యార్థులతో ఆత్మీయ సమావేశం ఆనందోత్సాహాల

ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

నడుమ జరుపుకున్నారు. 15ఏళ్లుగా వీరు అందరూ ఒక టీంగా ఏర్పడి ఎవరికి ఏ కష్టం వచ్చినా తాము ఉన్నామంటూ సాయం చేస్తూ వాళ్లకి ఆర్థికంగా భరోసాను ఇస్తూ వాళ్ల కష్టాలను తీర్చుతున్నారు. ఇక ముందు కూడా మంచి కార్యక్రమాలు చేయాలని తీర్మానించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ పూర్వ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమానికి జిటి నాయుడు, విక్రమ్ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## కమ్ముకున్న మంచు దుప్పటి

మంచు కురిసే వేళలో... పొంగ మంచుతో రోడ్డు కనిపించక ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం 9గంటల వరకు పొగ మంచు కురిసింది. ఎదురుగా వస్తున్న వాహనం కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. ప్రతి రోజూ నడక, వ్యాయామం చేసే వారికి పొగ మంచు ఇబ్బందులకు గురి చేసింది.

**- ప్రజాశక్తి, ఇచ్ఛాపురం**

సముద్ర తీరంలో ఆసనాలు వేస్తున్న సభ్యులు

## మానసిక పరిపక్వత అవసరం

**టెక్కలి:** సమాజంలో మానవ సంబంధాలు మెరుగుపడాలంటే ప్రతి ఒక్కరిలోనూ మానసిక పరిపక్వత అవసరమని బిఎస్‌జెఆర్ విద్యాసంస్థల అధినేత కోత మురళీధర్ అన్నారు, వాయుపుత్ర స్లిమ్ అండ్ జిమ్ ఆధ్వర్యంలో భోగీ సందర్భంగా శనివారం సముద్ర స్నానాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనుమరుగవుతున్న ఆచారాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భగా సముద్ర తీరంలో యోగా ఆసనాలు చేపట్టారు. కార్యక్రమంలో జిమ్ అధ్యక్షులు ఆనిశెట్టి చిట్టెన్న, నిర్వాహకులు జోగి శ్రీనివాసరావు, ఎన్.కిషోర్‌కుమార్, దుంపా శ్రీనివాస్, దండా శ్రీనివాసరావు, చలపతిరావు, నర్తు క్రిష్ణారావు, భుజంగరావు, బెహరా, తదితరులు పాల్గొన్నారు.

## కమనీయం.. గోదా కళ్యాణం

**ప్రజాశక్తి - కవిటి**
45 రోజులుగా గోదాదేవి పూజ చేస్తున్న యాత్రికులు శనివారం గోదా రంగనాధుల కళ్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. మండలంలోని బెజ్జిపుట్టుగ చక్ర పెరుమాళ్ స్వామి ఆలయం, బొరివంక పెద్ద ఒరియా వీధి, ప్రగడ పుట్టుగ కోదండ రామాలయం, లోళ్లపుట్టుగ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కవిటి కొత్తూరు రామాలయాల్లో గోదా కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించి అన్నదానం చేపట్టారు. బొరివంక పెద్దఒరియా వీధిలో గోపికల వేషధారణలతో యువత, కోలాటం ఆకట్టుకుంది. ఎమ్మెల్యే ప్రగడపుట్టుగ, సీమూరులో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

**ప్రజాశక్తి - పలాస**
మండలంలోని ఉద్దాన ప్రాంతంలో బొడ్డపాడు, మామిడి పల్లి, సుమ్మాదేవి, రంగోయి, గురుదాస్ పురం, నీలావతి, మాకన్న పల్లి తదితర గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. గ్రామంలో ఉన్న యువత జట్లుగా ఏర్పడి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ తదితర ఆటలు ఆడుతూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. రసవత్తరంగా జరుగుతున్న క్రీడలను చూసేందుకు గ్రామంలో ఉన్న పెద్దలు సైతం తిలకించారు. ఉద్దాన ప్రాంతంలో ఏ పల్లె చూసినా.. ఏ గ్రామానికి వెళ్లినా.. క్రీడలతో కళకళలాడాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు అన్ని ఆటపాటల్లో పాల్గొంటూ ఉత్సాహంగా గడుపుతున్నారు.

ఖోఖో ఆడుతున్న యువకులు